సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం వాలునాయక్ తండాలో కరెంట్ స్తంభం ఎక్కిన యువ రైతు చౌహాన్ రాజు

భూమి పోతున్నది.. నేనెట్లా బతికేది?

కరెంట్ స్తంభం ఎక్కి యువ రైతు నిరసన

సిర్గాపూర్, అక్టోబర్ 13 : గతంలో సర్కారు ఇచ్చిన భూమిని తిరిగి తీసుకుంటే తాను ఎలా బతికేది? అంటూ యువ రైతు విద్యుత్తు స్తంభం ఎక్కి ఆందోళన చేపట్టాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం వాసర్ వాలునాయక్ తండాలో ఆదివారం చోటుచేసుకున్నది. గ్రామ శివారులోని 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పేరుతో గతంలో గిరిజనులకు ఇచ్చిన భూములను తిరిగి తీసుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తండాకు చెందిన బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ క్రమంలో చౌహాన్ రాజు అనే యువ రైతు ఏకంగా విద్యుత్తు స్తంభం ఎక్కి నిరసన తెలిపాడు. 'నా భూమి పోతుంది.. నేను ఎట్లా బతికేది?' అంటూ ఆవేదనతో ఆత్మహత్యకు యత్నించాడు. కొందరు స్థానికులు చాకచక్యంతో రాజును సముదాయించి కిందకు దింపారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డితో మాట్లాడి నష్టపరిహారం డిమాండ్ చేద్దామని తండా వాసులు చెప్పి ఆయన్ను శాంతింపజేశారు. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలని లేకపోతే ఆందోళన చేస్తామని తండాకు చెందిన బాధిత రైతులు హెచ్చరించారు.

పల్లెను వదిలి పట్నం బాట: *దసరా సెలవులకు సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు ఆదివారం పట్నం బాట పట్టారు. సోమవారం ఉదయమే విధులకు వెళ్లాల్సి ఉండడంతో ఆదివారమే హైదరాబాద్‌కు పయనమయ్యారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాజీవ్‌రహదారిపై దుద్దెడ టోల్‌గేట్ వద్ద భారీగా బారులు తీరిన వాహనాలు*

ఐపీఎస్.. పైసావసూల్!

- **మట్కాగ్యాంగ్, క్రికెట్ బెట్టింగ్, పేకాట క్లబ్, భూదందాలు**
- **చర్చనీయాంశంగా కొందరు పోలీసు ఉన్నతాధికారుల తీరు**
- **చర్యలకు వెనుకాడుతున్న రాష్ట్ర ప్రభుత్వం**

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొందరు పోలీసు అధికారుల తీరు తీవ్ర వివాదాస్పదంగా మారింది. చట్టాన్ని రక్షించాల్సినవారే చట్టాన్ని తమకు అనుకూలంగా మలచుకొని కాసుల వేటలో పడ్డారు. మంచి పోస్టింగ్ ఉన్నపుడే డబ్బులు కూడబెట్టుకోవాలన్న ధోరణితో అడ్డగోలుగా అక్రమాలకు తెరతీస్తున్నారు. తమను అడ్డుకునేవారు లేరన్నట్టుగా వారి ప్రవర్తన ఉంటున్నది. వీరిని అదుపులో ఉంచాల్సిన కొందరు సీనియర్ అధికారులు కూడా చూసీచూడనట్టు వ్యవహరిస్తుండటంతో ఇలాంటివారు ఆడిందే ఆటగా సాగుతున్నది. రాష్ట్రంలో అత్యంత కీలకమైన జిల్లాల్లో మంచి పోస్టులు సాధించినవారు పోస్టుల్లో చేరటమే ఆలస్యం.. వసూళ్ల రంగంలోకి దిగుతున్నట్టు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇలాంటివారిపై అక్కడక్కడ ఒకట్రెండు చర్యలుంటున్నప్పటికీ, తూతూమంత్రంగానే ఉంటున్నాయి. దీంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వం వీరిపై గట్టి చర్యలు తీసుకునేందుకు వెనుకాడుతున్నది.

ఆయన మట్కా కింగ్

రాష్ట్ర సరిహద్దుల్లో మహారాష్ట్రకు దగ్గరగా ఉండే ప్రాంతంలో ప్రత్యేకాధికారిగా పనిచేసిన ఓ యువ ఐపీఎస్.. మట్కా గ్యాంగ్‌లను పోషించటంలో ప్రసిద్ధుడు. ఆయన అండ చూసుకొని మట్కా గ్యాంగ్‌లు రెచ్చిపోయాయి. మట్కా వంటి జూదాన్ని తెలంగాణలో నిషేధించారు. మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉండటంతో ఆయన అవకాశాన్ని మలచుకున్నారు. ఒక్క మట్కాతోనే ఆయన ఆగలేదు. క్రికెట్ బెట్టింగ్‌లలోనూ ఆరితేరారు. ఆయన నడిపించే బెట్టింగ్ గ్యాంగ్‌ల రేంజ్ రూ.25 లక్షలపైగా ఉంటుంది. అంటే.. నికరంగా ప్రతి క్రికెట్ మ్యాచ్‌కు ఆయనకు రూ.25 లక్షలకు తక్కువ ముట్టదు. సరిహద్దు జిల్లాలో ఉన్న ఆయనను హైదరాబాద్‌కు బదిలీ చేశారు. ఇక్కడ కూడా అదే దందా కొనసాగిస్తున్నారు. ఈయన వ్యవహారశైలి పోలీసుశాఖలోని అనేక మందికి తెలుసు. అయినా ఎవ్వరూ ఏమీ అనరు. రాబోయే పదేండ్లలో తాను రాజకీయ రంగంలోకి వెళ్లాలనుకుంటున్నట్టు చెప్తున్న ఆ యువ ఐపీఎస్.. రాజకీయాలకు అవసరమైన డబ్బు సంపాదనే లక్ష్యమని తన మిత్రుల వద్ద వ్యాఖ్యానిస్తున్నట్టు తెలిసింది. ఆయన తీరు వివాదాస్పదమైనప్పటికీ ఉన్నతాధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నట్టు సమాచారం.

ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఆ అధికారి కూడా అంతే

ఉమ్మడి మెదక్ జిల్లాలో కీలక అధికారిగా పనిచేస్తున్న ఓ ఐపీఎస్ కూడా డబ్బుల వేటలో పడ్డారు. దీపం ఉన్నపుడే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న లక్ష్యంతో ఉన్న ఈయన.. కొంతమంది కింది స్థాయి అధికారులను కేవలం వసూళ్ల కోసమే నియమించుకున్నారనే ఆరోపణలు

వస్తున్నాయి. ప్రధానంగా భూదందాలపై దృష్టి సారిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. హైదరాబాద్‌కు అత్యంత సమీపంలో ఉండే ఓ ప్రాంతంలోని సివిల్ పంచాయితీలో తలదూర్చి తనకు అనుకూలమైన వ్యక్తికి భూబదిలీ అయ్యేలా చూశారని పెద్దఎత్తున ఆరోపణలున్నాయి. రకరకాల కంపెనీల్లోని భాగస్వామ్యుల మధ్య ఉండే గొడవలను కూడా ఈయన చాకచక్యంగా వాడుకుంటారనే ఆరోపణలు వస్తున్నాయి.

చార్జిమెమోలతో సరి

ఓ యువ ఐపీఎస్ అధికారి భర్త ఐఏఎస్. అయితే, ఆ ఐపీఎస్ ఏకంగా భూదందాలు మొదలుపెట్టారని సమాచారం. విషయం ఉన్నతాధికారులకు చేరడంతో ఆమెకు చార్జిమెమో ఇచ్చి సరిపెట్టారు. ఐపీఎస్ కావడంతో ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా వదిలివేశారని, కింది స్థాయి అధికారులు ఆమెలా భూదందాలు చేస్తే సస్పెండ్ చేసేవారని చెప్తున్నారు. గతంలో మహబూబ్‌నగర్, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో పనిచేసిన మరో అధికారి ఏకంగా ఎన్నికల నిధులనే నొక్కేశారన్న ఆరోపణలు వచ్చాయి. ఆయనపై శాఖాపరమైన విచారణ చేశారు. ఈయనకు కూడా మెమో ఇచ్చి చేతులు దులిపేసుకున్నారు. మెదక్, నల్లగొండ, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో పనిచేసిన మరో ఐపీఎస్ అధికారిణి పేకాట క్లబ్బులనే తెరిచారు. ఆమె నగరంలో ఓ అపార్ట్‌మెంట్‌ను కిరాయికి తీసుకొని తమవారినే అక్కడ పెట్టి పేకాట కేంద్రాన్ని నడిపించారన్న ఆరోపణలున్నాయి. ఒక్కరిద్దరు కాదు.. మరో అయిదారుగురు అధికారులు ఇదే తరహా ఆరోపణలు ఎదుర్కొంటున్నారని పోలీసువర్గాలే చెప్తున్నాయి.

త్వరలోనే పలువురు అధికారుల బదిలీ?

హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలో కొంత మంది ఐపీఎస్‌లను బదిలీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. హైదరాబాద్‌లో ఫోన్ ట్యాపింగ్ అంశంతో ముడిపడిన ఓ అధికారి అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నట్టు ఉన్నతాధికారులు గుర్తించారు. వినాయక నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ ఉండటంతో ఆయనను బదిలీ చేయలేదు. ఒకట్రెండు రోజుల్లోనే బదిలీ చేయనున్నట్టు సమాచారం. మత ఘర్షణలను సమర్థంగా నివారించలేకపోయారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒకరిద్దరు అధికారులను కూడా మార్చే అవకాశం ఉన్నది. మొత్తంగా ఐదారుగురు ఐపీఎస్‌లను బదిలీ చేయనున్నారు. వీరితో పాటు ఇటీవల ఐపీఎస్ హోదా సాధించినవారిలో ఆరుగురికి పోస్టింగ్ ఇవ్వనున్నారు.

బోనస్ వచ్చేనా?

మొదటిపేజీ తరువాయి...

వ్యక్తమవుతున్నాయి.సన్నాలకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం సాధారణ రకం ధాన్యానికి రూ.2300గా, గ్రేడ్-ఏ రకానికి రూ.2320గా మద్దతు ధర నిర్ణయించింది. సన్న ధాన్యాన్ని సాధారణ రకంగా పరిగణిస్తారు కాబట్టి రైతులకు మద్దతు ధర, బోనస్ కలిపి క్వింటాలుకు రూ.2800 చొప్పున చెల్లించాలి. అయితే ప్రభుత్వం ఈ రెండు వేర్వేరుగా చెల్లించేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిసింది. దీనికి పౌరసరఫరాల సంస్థ సాంకేతిక కారణాలను సాకుగా చూపుతున్నట్టు సమాచారం. ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ, రైతులకు డబ్బుల చెల్లింపులు కేంద్ర ప్రభుత్వంతో ముడిపడి ఉంటాయి. ఇక్కడ కొనుగోలు చేసిన ధాన్యానికి, చెల్లింపులకు కేంద్ర ప్రభుత్వానికి లెక్క చూపించాలి. రైతులకు మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తుంది. బోనస్‌తో కేంద్రానికి సంబంధం లేదు. ఈ బోనస్‌ను రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో మద్దతు ధర, బోనస్ కలిపి ఇస్తే ఇబ్బందులు ఎదురవుతాయని అధికారులు చెబుతున్నట్టు తెలిసింది.

అనుకుంటే ఇవ్వొచ్చు.. కానీ!

ఓపీఎంఎస్ కారణంగా ఒకేసారి మద్దతు ధర, బోనస్ కలిపి చెల్లించడం సాధ్యం కాదంటున్న సివిల్ సప్లై వాదనను కొందరు అధికారులు తోసిపుచ్చుతున్నారు. ఇప్పటికే సన్న ధాన్యం, దొడ్డు ధాన్యం కొనుగోలుకు వేర్వేరు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అలాంటప్పుడు చెల్లింపుల్లో ఇబ్బందేమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. వేర్వేరు కేంద్రాలను ఏ విధంగా నిర్వహిస్తారో అదే విధంగా సన్న ధాన్యం కోసం మరో సాఫ్ట్‌వేర్‌ను ప్రత్యేకంగా తయారు చేయిస్తే సరిపోతుందని సూచిస్తున్నారు. ఓపీఎంఎస్‌తో మద్దతు ధర రూ.2300 లను, ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో రూ.500ను వేర్వేరుగా చెల్లించాలని చెప్తున్నారు.

భారాన్ని తప్పించుకునేందుకేనా?

బోనస్ భారాన్ని తప్పించుకునేందుకే ప్రభుత్వం సాంకేతిక సాకులు చూపుతున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటు మద్దతు ధర అటు బోనస్ ఒకేసారి చెల్లించాలంటే ప్రభుత్వంపై భారీగా ఆర్థిక భారం పడే అవకాశం ఉంది. ఈ సీజన్‌లో 91 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి వస్తుందనే అంచనాలున్నాయి. ఈ లెక్కన మద్దతు ధర ప్రకారం రూ.20,930 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో 47 లక్షల టన్నుల సన్న ధాన్యం వస్తుందని అంచనా వేస్తున్నారు. దీనికి రూ.500 బోనస్ ఇచ్చేందుకు రూ.2350 కోట్లు కావాలి. ఒకేసారి భారీ మొత్తంలో నిధులు సమకూర్చడం ప్రభుత్వానికి కత్తిమీద సామే. దీంతో మద్దతు ఒక రోజు, బోనస్‌ను మరో రోజున చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిసింది. బోనస్ చెల్లింపు వాయిదాపై రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మద్దతు ధర చెల్లించిన తర్వాత ఎన్ని రోజులకు బోనస్ చెల్లిస్తారనే అంశంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

అట్టహాసంగా అలయ్..బలయ్

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): దసరా పండుగ సందర్భంగా హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఆయన కూతురు విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అలయ్..బలయ్ అట్టహాసంగా సాగింది. కళాకారుల ఆటపాటలతో ప్రాంగణం మార్మోగింది. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, సినీ గాయకుడు వందేమాతరం శ్రీనివాస్ 'దోస్తర దిన్ అందమా.. దోస్తి కట్టుకుందామా..' అంటూ పాడిన పాట ప్రతిఒక్కరినీ ఆలోచింపజేసింది. కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, గవర్నర్లు గుర్మీత్‌సింగ్, విజయశంకర్, హరికిషన్‌రావుబాగ్డే, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ మంత్రులు మహమూద్‌అలీ, శ్రీనివాస్‌గౌడ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎంపీ బీ. వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ వాణీదేవి, బీఆర్‌ఎస్ మహిళా నేత తుల ఉమ, తదితరులు పాల్గొన్నారు.

• ముగిసిన శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ముగిశాయి. 9 రోజులపాటు కన్నులపండువగా సాగిన బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రి ధ్వజావరోహణంతో ముగిశాయి. బ్రహ్మోత్సవాల విశేషాలను టీటీడీ ఈవో శ్యామలరావు ఆదివారం విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. అక్టోబర్ 4 నుంచి 11వ తేదీ వరకూ నిర్వహించిన బ్రహ్మోత్సవాల్లో 6 లక్షలమంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 2.60 లక్షల మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. 15 లక్షల మంది భక్తులు శ్రీవారి వాహనసేవలను తిలకించారు. కీలకమైన గరుడ సేవలో దాదాపు 3.5లక్షల మంది పాల్గొన్నారు. మొత్తం 30 లక్షల లడ్డూలను టీటీడీ విక్రయించింది. హుండీ కానుకల ద్వారా బ్రహ్మోత్సవాల సమయంలో రూ.26 కోట్లు ఆదాయం వచ్చినట్టు ఈవో శ్యామలరావు తెలిపింది. - హైదరాబాద్

నేడు గ్రూప్-1పై హైకోర్టు తీర్పు

- **పలు కేసులపై వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేసిన న్యాయస్థానం**
- **21 నుంచి మెయిన్స్ నిర్వహణకు సిద్ధమవుతున్న టీజీపీఎస్సీ**
- **నేటి నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్**
- **మెయిన్స్‌పై ప్రభావం చూపనున్న తీర్పు?**

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు సంబంధించి దాఖలైన పలు కేసులపై హైకోర్టు తుది తీర్పును సోమవారం వెలువరించనున్నది. ఆయా కేసుల్లో ఇప్పటికే విచారణను పూర్తిచేసిన హైకోర్టు తీర్పును సోమవారానికి రిజర్వు చేసింది. ఈ తీర్పు ఎవరికి అనుకూలంగా వస్తుందోనన్న ఉత్కంఠ నెలకొన్నది. గ్రూప్-1 ప్రిలిమ్స్ ఫైనల్ 'కీ'లో తప్పులున్నట్టు తాము ఆధారాలతో సహా కోర్టుకు సమర్పించామని, కాబట్టి తమకు అనుకూలంగా తీర్పు వస్తుందని అభ్యర్థులు భావిస్తున్నారు. తెలుగు అకాడమీ పుస్తకాలు ప్రామాణికం కాదని, వికీపీడియా, గూగుల్ ఆధారంగా ఫైనల్ 'కీ'ని రూపొందించామని టీజీపీఎస్సీ హైకోర్టుకు తెలపడం వంటి అంశాలు తమకు అనుకూలంగా మారతాయని అభ్యర్థులు అంచనా వేస్తున్నారు. గ్రూప్-1పై హైకోర్టులో 15కుపైగా కేసులు ఉన్నాయి. వీటిలో ఫైనల్ 'కీ'పై వేసిన కేసు అత్యంత కీలకమైనది. వీటితోపాటు ఎస్టీ రిజర్వేషన్లకు సంబంధించి జీవో-33పై దాఖలైన కేసు, గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి 503 పోస్టులు, కొత్త నోటిఫికేషన్‌లో అదనంగా చేర్చిన 60 పోస్టులకు కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారికి అవకాశం ఇవ్వాలన్న అంశంపై వేసిన కేసు, హైకోర్టు మళ్లీ రీ ఎగ్జామ్ నిర్వహించాలని ఆదే

శించిన నేపథ్యంలో, పాత నోటిఫికేషన్‌ను రద్దుచేసి కొత్త నోటిఫికేషన్ ఇవ్వడంపై వేసిన కేసులపై కూడా తీర్పు రానున్నది. ఈ నెల 16న రిజర్వేషన్లపై వేసిన మరో మూడు కేసులు సైతం హైకోర్టు ముందు విచారణకు రానున్నాయి.

21 నుంచి గ్రూప్-1 మెయిన్స్

ఈ నెల 21 నుంచి 27 వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరగాల్సి ఉన్నది. అయితే, ఫైనల్ 'కీ'తో పాటు మరికొన్ని కేసులు మెయిన్స్‌కు ఆటంకంగా నిలుస్తున్నాయి. గ్రూప్-1పై ఉన్న కేసులు తేలే దాకా పరీక్షలను నిర్వహించొద్దని అభ్యర్థులు కోరుతున్నారు. అంతవరకు ఈ నెల 21 నుంచి జరగాల్సిన పరీక్షలను వాయిదావేయాలని డిమాండ్ చేస్తున్నారు. కానీ టీజీపీఎస్సీ మాత్రం పరీక్షలకు ఏర్పాట్లు చేస్తున్నది. ఒకవేళ కోర్టు తీర్పు అభ్యర్థులకు అనుకూలంగా వస్తే మాత్రం, గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను వాయిదా వేసే అవకాశం ఉంటుంది. కోర్టు తీర్పుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయడానికి కమిషన్‌కు కొంత సమయం పడుతుంది.

నేడు హాల్‌టికెట్ల విడుదల

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల హాల్‌టికెట్లను టీజీపీఎస్సీ సోమవారం విడుదల చేయనున్నది. అభ్యర్థులు సోమవారం నుంచే తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, పరీక్షకు ఒకరోజు ముందు అంటే ఈ నెల 21 వరకు హాల్‌టికెట్లు అందుబాటులో ఉంటాయని తెలిపింది. ఈ నెల 21 నుంచి 27 వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. అభ్యర్థులను మధ్యాహ్నం 12:30 గంటల నుంచి పరీక్షాకేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఈ పరీక్షలకు 31,382 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు.

జీహెచ్‌ఎంసీ మేయర్‌పై కేసు

సద్దుల బతుకమ్మ వేడుకల్లో అర్ధరాత్రి దాకా డీజే!

బంజారాహిల్స్,అక్టోబర్ 13: బతుకమ్మ సందర్భంగా నిర్దేశిత సమయం దాటిన తర్వాత కూడా డీజే సౌండ్స్ ఉపయోగించిన ఘటనలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మితోపాటు మరో ఇద్దరు వ్యక్తులపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 10న సద్దుల బతుకమ్మ సందర్భంగా బంజారాహిల్స్ రోడ్ నం.12 లోని ఎన్‌బీనగర్‌లో మేయర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో భారీ ఎత్తున వేడుకలు నిర్వహించారు. రాత్రి 11.45 గంటల తర్వాత కూడా డీజే సౌండ్స్ పెట్టడంతో స్థానిక పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ వీడియోలు వైరల్ కావడంతో పోలీసులు సుమోటోగా నిర్వాహకులు విజయ్‌కుమార్, గౌస్‌తోపాటు మేయర్ గద్వాల్ విజయలక్ష్మిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

• నేత్రానందం.. ఆదిదంపతుల జలవిహారం

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా త్రినేత్రికి జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ జోగుళాంబ ఆలయం వద్ద శనివారం తుంగభద్ర నదిలో అంగరంగ వైభవంగా తెప్పోత్సవం నిర్వహించారు. ఆదిదంపతులు హంసవాహనంపై చేసిన జలవిహారం (తెప్పోత్సవం)తో నదీమతల్లి పులకించింది. - అలంపూర్

మళ్లీ రేఖ దాటిన సురేఖ!

మొదటిపేజీ తరువాయి...

చేశారు. తన మాట వినని ఇన్ స్పెక్టర్, ఏసీపీ, డీసీపీలపై చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్‌తో వాగ్వాదానికి దిగారు. దసరా ఫ్లెక్సీలతో రగిలిన ఫొటోల వివాదంలో ఆమె జోక్యం చేసుకొని రచ్చకెక్కడాన్ని కాంగ్రెస్ వర్గాలే తప్పుపడుతున్నాయి.

దసరా సందర్భంగా భగ్గుమన్న ఆధిపత్యపోరు

వరంగల్ ఉమ్మడి జిల్లాలో మంత్రి కొండా సురేఖకు, పలువురు అధికార పార్టీ ఎమ్మెల్యేలకు మధ్య తీవ్ర విభేదాలున్నాయి. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి, మంత్రి సురేఖకు మధ్య ఈ విభేదాలు తారాస్థాయికి చేరాయి. పరకాల నియోజకవర్గంలో ఆధిపత్యం కోసం మంత్రి సురేఖ వ్యవహరిస్తున్న తీరుపై ఎమ్మెల్యే రేవూరి స్వయంగా ఆమెతోనే ఫోన్‌లో వాగ్వాదానికి దిగారు. అప్పటి నుంచి వీరిద్దరి గ్రూపు రాజకీయాలు కార్యకర్తల గొడవల దాకా వెళ్తున్నాయి. గ్రేటర్ వరంగల్ పరిధిలోని పరకాల నియోజకవర్గం గీసుగొండ మండలం ధర్మారంలో శనివారం సాయంత్రం దసరా వేడుకలు నిర్వహించారు. మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు వర్గీయులుగా ఉన్న బండి రాజ్‌కుమార్, ముస్కు సురేశ్, కూస రాజుకుమార్, చౌడు శివప్రసాద్, ముస్కు రాజుకుమార్, చుంచు రాజు, మహేశ్వర్, వంశీ స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఫొటో లేకుండానే ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీలో ఎమ్మెల్యే ఫొటో ఎందుకు పెట్టలేదని గ్రామానికి చెందిన రేవూరి ప్రకాశ్‌రెడ్డి అనుచరులు పిట్టల అనిల్, పిట్టల భాను గొడవకు దిగారు. ఇరు వర్గాల మధ్య వాగ్వాదం ఉత్సవాల్లో స్థానిక ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. స్థానికులు కల్పించుకొని ఇరు వర్గాలను శాంతింపజేశారు. కొద్ది సేపటి తర్వాత మంత్రి సురేఖ అనుచరులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఎమ్మెల్యే రేవూరి వర్గీయులు చింపివేశారు. దీంతో రెండు వర్గాలు కొట్టుకున్నాయి. దాడిలో ఎమ్మెల్యే రేవూరి వర్గీయులు పిట్టల అనిల్, భాను గాయపడ్డారు. వీరిలో పిట్టల అనిల్‌ను ఎమ్మెల్యే రేవూరి ఆదివారం పరామర్శించారు. ధర్మారంలో ఎలాంటి గొడవలు కాకుండా వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మంత్రి వర్గీయులు ఎనిమిది మందిపై గీసుగొండ పోలీస్‌స్టేషన్‌లో పిట్టల అనిల్, పిట్టల భాను ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంత్రి అనుచరులైన బండి రాజుకుమార్, ముస్కు సురేశ్, కూస రాజ్‌కుమార్, చౌడ శివప్రసాద్. ముస్కు రాజ్‌కుమార్, చుంచు రాజును పోలీసులు గీసుగొండ పోలీస్ స్టేషన్‌ను తీసుకువచ్చి కొట్టారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో ముగ్గురు భవానీ మాలలు ధరించి ఉన్నారని, వారిని వదిలపెట్టాలని మంత్రి సురేఖ అనుచరుడైన మాజీ రౌడీ షీటర్ గోపాల నవీన్ రాజు పోలీసులను డిమాండ్ చేశాడు. పోలీసులు వదిలి పెట్టకపోవడంతో మంత్రి సురేఖ డీసీపీ, ఏసీపీలకు ఫోన్ చేసి వారిని వదిలిపెట్టాలని ఆదేశించారు. పోలీసులు వారిని వదిలిపెట్టడం లేదని అహనంతో ధర్మారంలో ధర్నా చేయాలని తన అనుచరులను పురమాయించారు. మంత్రి సురేఖ ఆదేశాల మేరకు ఆమె అనుచరులు ధర్మారంలో వరంగల్-నర్సంపేట రహదారిపై ధర్నా చేశారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

ఆటోలో ఠాణాకు మంత్రి

పోలీసులు మాట వినడం లేదని అసహనంతో మంత్రి కొండా సురేఖ గీసుగొండకు బయల్దేరారు. మంత్రి అనుచరుల ధర్నా కారణంగా ధర్మారంలో ట్రాఫిక్ జామ్ కావడంతో మంత్రి కాన్వాయ్‌లోని కారు దిగి ధర్నా అటు వైపునకు వెళ్లి ఆటోలో ఠాణాకు వెళ్లారు. పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఆవేశంతో ఊగిపోయారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. 'మా వాళ్లను ఎందుకు అరెస్టు చేశారు. ఎందుకు కొట్టారు. వాళ్లు ఏమైనా దేశద్రోహులా? కాంగ్రెస్ నాయకులను కొడతారా? వీరంతా పని చేయడం వల్లే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పరకాలలో ఎమ్మెల్యేగా గెలిచాడు. గాయపడిన పిట్టల అనిల్‌ను పోలీసు స్టేషన్‌కు తీసుకురావాలి' అని పోలీసు అధికారులను డిమాండ్ చేసి అక్కడే ఇన్‌స్పెక్టర్ కుర్చీలో కూర్చుకున్నారు.

పోలీసుల బదిలీకి డిమాండ్..

మంత్రి సురేఖ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన విషయం తెలుసుకుని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అక్కడికి చేరుకున్నారు. పోలీస్ కమిషనర్‌తో మంత్రి సురేఖ

మంత్రి కొండా సురేఖ పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు వెళ్లే క్రమంలో జై కొండా అని నినాదాలు చేస్తున్న కొండా వర్గీయులు, వాహనంలో మంత్రి సురేఖ

వాగ్వాదానికి దిగారు. తమ వారిపై దాడి చేసిన డీసీపీ రవీందర్, ఏసీపీ తిరుపతి, ఇన్‌స్పెక్టర్ మహేందర్‌ను బదిలీ చేసి వారిపై చర్యలు తీసుకోవాలని, అప్పటి వరకు పోలీస్ స్టేషన్‌లోనే ఉంటానని పట్టుబట్టారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని వరంగల్ సీపీ చెప్పినా అర గంట సేపు అక్కడే ఉన్నారు. ఆమె అనుచరులు పెద్ద సంఖ్యలో గీసుగొండ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని 'పోలీసులు డౌన్‌డౌన్' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. పోలీసుల చేతిలో దెబ్బలు తిన్న వారిని మంత్రి సురేఖ సమక్షంలోనే పిలిచి విచారణ చేసి బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకుంటానని సీపీ హామీ ఇవ్వడంతో మంత్రి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

సురేఖకు సీఎం ఫోన్?

గీసుగొండ/హనుమకొండ, అక్టోబర్ 13: పోలీస్‌స్టేషన్‌కు మంత్రి సురేఖ వచ్చి పోలీసులపై చర్యలు తీసుకునేదాకా అక్కడే కూర్చుంటానని చెప్పడంతో వరంగల్ సీపీ ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో నేరుగా సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ పెద్దల నుంచి సురేఖకు ఫోన్ రావడంతోనే ఆమె పోలీస్ స్టేషన్ నుంచి వెళ్లిపోయారని కాంగ్రెస్ నాయకులు చెప్తున్నారు. హైదరాబాద్‌కు రావాలని, ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి వస్తున్నారని, కూర్చొని మాట్లాడుదామని సురేఖకు రేవంత్ చెప్పినట్టు సమాచారం.

మా వాళ్లను ఇబ్బంది పెడితే సహించ : సురేఖ

కొండా కుటుంబం అంటే గిట్టని కొందరు నీతిమాలిన పనులు చేస్తున్నారని, తమ కుటుంబంపై బురదజల్లే వ్యవహారాలను ఎండగడుతున్న తమవాళ్లను ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని మంత్రి సురేఖ హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ తన కుటుంబం వంటిదని, కొందరు పార్టీ కార్యకర్తలు, తమ అనుచరులను గీసుకొండ పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారని తెలిసి తాను అక్కడికి వెళ్లానని చెప్పారు. తాను స్టేషన్‌కు రావడంతో పార్టీ కార్యకర్తలు, అనుచరులు పెద్ద ఎత్తున తరలివచ్చారని, అంతకుమించి అక్కడ ఏం జరగలేదని పేర్కొన్నారు.

అప్పు పుట్టలే.. రుణమాఫీ కాలే

మొదటిపేజీ తరువాయి...

డిసెంబర్ 9 నాటికి రుణమాఫీ పూర్తి చేస్తామని చెప్పారు. గత డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఈ ఏడాది డిసెంబర్ 9 వరకు రుణమాఫీ పూర్తి చేస్తామని మంత్రి చెప్పడంతో రైతులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. పైగా అప్పు తీర్చడం కోసం అప్పు పుట్టలేదని చెప్పడంతో రుణమాఫీ ఎగ్గొడుతారనే అనుమానాలు వ్యక్తంచేశారు. రుణమాఫీ ఇక మాఫీయేనా..? అని రైతులు గుసగుసలాడుకున్నారు. ఇదిలా ఉంటే, తమ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంలో రైతుభరోసా పథకాన్ని అమలు చేస్తామని మంత్రి తెలిపారు. ఈ ఏడాది రెండో పంట కాలంలో రైతులకు 'రైతు భరోసా' అందిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకోసం ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు కసరత్తు వేగవంతం చేస్తున్నారని వివరించారు.